RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 236 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | గురువారం, 29 ఫిబ్రవరి 2024 | పేజీలు : 4 | వెల : 2/-

## మంత్రి వర్గ విస్తరణపై...

# మొదలైన కసరత్తు!




### పార్లమెంటు ఎన్నికల్లోపే కొత్త మంత్రులు.. ఒకరిద్దరికి బంపరాఫర్?

హైదరాబాద్ : తెలంగాణలో కొత్త ప్రభుత్వం తన కార్యాచరణను వేగిరం చేస్తోంది.. ఒక్కోటిగా పథకాలు చేపడుతూ తనదైన శైలిలో ముందుకెళ్తోంది. మంత్రులు సైతం స్వేచ్ఛగా వ్యవహరిస్తూ తమ కర్తవ్యాన్ని నెరవేరుస్తున్నారు. అయితే, పూర్తిస్థాయి మంత్రివర్గం మాత్రం ఇంకా కొలువుదీరలేదు. ముఖ్యమంత్రితో కలుపుకొని మంత్రివర్గంలో 18 మందికి చాన్స్ ఉంటుంది. ఈ లెక్కన ప్రస్తుతం 12 మంది మాత్రమే ఉన్నారు. ఇంకా ఆరు ఖాళీలున్నాయి. అందులోనూ గ్రేటర్ హైదరాబాద్ వంటి అత్యంత కీలకమైన ప్రాంతానికి మంత్రి లేరు. ఈ ప్రాంతంలో కాంగ్రెస్ ఒక్కటే సీటు గెలవడం, సామాజిక సమీకరణాల ప్రకారం ప్రాధాన్యం ఇవ్వాల్సి రావడంతో తొలి విడతలో ఎవరికీ చాన్స్ ఇవ్వలేదు.

**మలి విడతలో ఖాయం :** వచ్చే లోక్ సభ ఎన్నికలకు పూర్తిస్థాయి మంత్రివర్గంతో వెళ్లేందుకే సీఎం రేవంత్, కాంగ్రెస్ అధిష్ఠానం సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే సాధ్యమైనంత త్వరగా మంత్రివర్గ విస్తరణ చేపట్టాలని యోచిస్తున్నట్లు సమాచారం. అందుకనే ఖాళీగా ఉన్న స్థానాలను భర్తీ చేయాలని భావిస్తున్నట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. దీంతోపాటు ఖాళీగా ఉన్న స్థానాల్లో ఇప్పటివరకు స్థానం దక్కని జిల్లాలు, సామాజిక వర్గాలకు అవకాశం కల్పించాలని చూస్తున్నట్లుగా తెలిసింది. మలి విడతలో కొన్ని కొత్త ముఖాల పేర్లు వినిపిస్తున్నాయి. ఖాళీగా ఉన్న ఆరు మంత్రి పదవుల్లో ఎస్టీ, బీసీ, ఎస్సీలకు ఒక్కోటి చొప్పున ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. దీనికోసం ఎస్టీ కోటా బాలూ నాయక్, ఎస్సీ విభాగంలో వివేక్ పేర్లు వినిపిస్తున్నాయి. వాకిటి శ్రీహరి (మక్తల్), ఈర్లపల్లి శంకర్ (షాద్ నగర్)లకు బీసీ కోటాలో చోటిస్తారని పేర్కొంటున్నారు. రెడ్డి వర్గం నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి (నల్లగొండ), మల్ రెడ్డి రంగారెడ్డి (గ్రేటర్ హైదరాబాద్), సుదర్శన్ రెడ్డి (నిజామాబాద్)లలో ఒకరికి బెర్తు ఖాయమంటున్నారు. హైదరాబాద్ లో గెలిచిన ఏకైక కాంగ్రెస్ ఎమ్మెల్యే మల్ రెడ్డి. నిజామాబాద్ నుంచి ఇప్పటివరకు ఎవరికీ చాన్స్ రాలేదు.

వెలమల కోటాలో ఇప్పటికే జూపల్లి ఉండగా.. ప్రేమ్ సాగర్ రావు, మదన్ మోహన్ ల పేర్లు చెబుతున్నారు.

**ఎన్ఎస్ యూఐ నేతకు బంపర్ ఆఫర్ :** ఎన్ఎస్ యూఐ నాయకుడు ఒకరిని రాహుల్ గాంధీ నేరుగా సిఫార్సు చేసినట్లు చెబుతున్నారు. అతడికి బంపర్ ఆఫర్ తరహాలో మంత్రి పదవి దక్కడం అందరినీ ఆశ్చర్యపరిచేలా ఉంది.

ఆ ఎన్ఎస్ యూఐ నేత ఎవరనేది మాత్రం ఇంతవరకు ఖరారు కాలేదు. వాస్తవానికి కాంగ్రెస్ విద్యార్థి విభాగమైన ఎన్ఎస్ యూఐ.. ఆ పార్టీ యువజన విభాగం కంటే తక్కువ స్థాయి. అయితే, రాహుల్ సిఫార్సుతో ఎన్ఎస్ యూఐ నాయకుడికే మంత్రి పదవి రానుండడం విశేషమే. అతడు ఎవరనేది చూడాలి. మొత్తానికి 15 రోజుల్లోనే తెలంగాణ మంత్రివర్గ విస్తరణ ఖాయమంటున్నారు.

## కేటీఆర్ క్షమాపణ చెప్పకపోతే క్రిమినల్ కేసు పెడతాం




హైదరాబాద్ : తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను వెనక్కు తీసుకొని, బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని టీపీసీసీ ఉపాధ్యక్షులు బండ్రు శోభా రాణి డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజలు ఇచ్చిన తీర్పుతో కేటీఆర్ చిన్న మెదడు చితికిపోయి మాట్లాడుతున్నారని సెటైర్లు వేశారు. బీఆర్ఎస్ నేతలందరూ ఆసుపత్రిలో చూపించుకోవాలని దుయ్యబట్టారు. లంకె బిందెల్లాంటి రాష్ట్రాన్ని దివాళా తీసేలా చేశారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పేరుతో రాష్ట్ర ఖజానాని హరీష్ రావు ఖాళీ చేశారని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజలకు స్వేచ్ఛ లేకుండా చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రజలకి విముక్తి లభించిందని పేర్కొన్నారు. ఆస్తుల చిట్టాని కేసీఆర్ కుటుంబం బయటపెట్టాలని కోరారు. కేటీఆర్ క్షమాపణ చెప్పకపోతే క్రిమినల్ కేసు పెడతామని ఆమె హెచ్చరించారు. ఇదిలావుండగా.. సీఎం రేవంత్ రెడ్డిని టార్గెట్ చేసుకొని కేటీఆర్ ఇటీవల సంచలన వ్యాఖ్యలు చేశారు. ఓ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం అభ్యర్థిగా రేవంత్ రెడ్డిని ముందే ప్రకటించి ఉంటే, కాంగ్రెస్ పార్టీకి కనీసం 30 సీట్లు కూడా వచ్చేవి కావని కుండబద్దలు కొట్టారు. అసలు రేవంత్ రెడ్డి ఒక ముఖ్యమంత్రిలా మాట్లాడడం లేదని, అతని పాత బుద్ధులన్నీ మెల్లగా బయటకు వస్తున్నాయని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తామని స్వయంగా కాంగ్రెస్ వాళ్లే ఊహించలేకపోయారని ఎద్దేవా చేశారు. రైతు రుణమాఫీపై ప్రశ్నిస్తే రేవంత్ రెడ్డిలో రోషం పొడుచుకుని వస్తోందన్నారు. కాంగ్రెస్ వాళ్లు ఇటుకలతో కొడితే, తాము రాళ్లతో కొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. ఎన్నికల ముందు అడ్డగోలు హామీలిచ్చిన కాంగ్రెస్ నాయకులకు ఇప్పుడేం చేయాలో అర్థం కావడం లేదన్నారు. ఈ విధంగా వ్యాఖ్యలు చేయడంతో.. కేటీఆర్‌పై కాంగ్రెస్ నాయకులు మండిపడు తున్నారు. కేటీఆర్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

## అసలే ఓటమి.. ఆపై వర్గ విభేధాలు: గులాబీ పార్టీలో ముసలం!!



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో గత అసెంబ్లీ ఎన్నికలలో ఘోర పరాజయం పాలైన బీఆర్ఎస్ వచ్చే పార్లమెంటు ఎన్నికలలో సత్తా చాటాలని భావిస్తుంటే పరిస్థితులు అందుకు అనుకూలంగా కనిపించడం లేదు. అసలే ఓటమి బాధలో ఉన్న బీఆర్ఎస్ పార్టీకి పార్టీలో వర్గ విభేదాలు పెద్ద తలనొప్పిగా తయారయ్యాయి. పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి నియోజకవర్గాల సమీక్షలు కొనసాగుతున్న క్రమంలో నియోజకవర్గాల వారీగా పార్టీలో వర్గ విభేదాలు బయటపడుతున్నాయి. తాజాగా చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గంపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాజీ మంత్రి ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి మధ్య వర్గ విభేదాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. తెలంగాణ భవన్ వేదికగా పట్నం మహేందర్ రెడ్డి ప్రసంగిస్తున్న సమయంలో రోహిత్ రెడ్డి వర్గీయులు నినాదాలు చేయడంతో ఒక్కసారిగా ఉద్రిక్తత చోటు చేసుకుంది. పరస్పర నినాదాలతో వాతావరణం ఉద్రుతంగా మారింది. ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డికి మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డికి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అంతేకాదు పట్నం మహేందర్ రెడ్డి పైలెట్ రోహిత్ రెడ్డి కూడా ఒకరిపై ఒకరు కుర్చీలు విసురుకున్నారని సమాచారం. ఎన్నికల ఓటమికి మీరంటే మీరు కారణమంటూ ఇరువర్గాలు తీవ్ర స్థాయిలో గొడవకు దిగగా, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎమ్మెల్యే హరీష్ రావు వారిద్దరికీ సర్ది చెప్పారు. రివ్యూ మీటింగ్ లో బహిరంగంగా గొడవలు పడితే పార్టీ శ్రేణులకు తప్పుడు సంకేతాలు వెళతాయని హరీష్ రావు సర్ది చెప్పారు. ఒక్క చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం లో మాత్రమే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలలోనూ బీఆర్ఎస్ పార్టీ నేతల మధ్య అంతర్గత విభేదాలు ఉండడం ఇప్పుడు గులాబీ అధినేత కేసీఆర్ కు తలనొప్పిగా తయారైంది. అసెంబ్లీ ఎన్నికలలో ఓటమిపాలైనా, పార్లమెంటు ఎన్నికల్లో సత్తా చాటాలని భావిస్తున్న వేళ పార్టీలో వర్గ పోరు పార్టీకి తీరని నష్టం చేస్తుందని అధినేత భావిస్తున్నారు. ఇక ఈ గొడవలకు చెక్ పెట్టడానికి గులాబీ బాస్ ఏం చేయనున్నారు తెలియాల్సి ఉంది.



# వలసలు షురూ!

## బీజేపీలోకి బీఆర్ఎస్ ఎంపీలు?

### సిట్టింగ్ ఎంపీల చేరికను బట్టి ఎంపీ అభ్యర్థుల ఖరారుపై ఓ స్పష్టత

### 29న 8 నుంచి 10 లోక్‌సభ సీట్లకు అభ్యర్థుల ప్రకటన...?

హైదరాబాద్: ఒకరిద్దరు సిట్టింగ్ ఎంపీలు బీజేపీలో చేరేందుకు లైన్‌క్లియర్ అయింది. గురువారం ఢిల్లీలో బీజేపీ పార్లమెంటరీ సమావేశం జరిగే పక్షంలో ఆరోజుగానీ మరుసటి రోజుగానీ ఈ చేరికలు ఉండొచ్చని బీజేపీ నేతలు చెబుతున్నారు. ఒక ఎంపీ మాత్రం గురువారం మంచిరోజు ఉందని, ఆ రోజే పార్టీలో చేరుతానని చెప్పినట్టు తెలిసింది. ఇటీవల అచ్చంపేటలో జరిగిన బీఆర్ఎస్ ఆత్మీయ సమావేశానికి నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు గైర్హాజరయ్యారు. ఆయనతోపాటు కుమారుడు పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని, బీజేపీ అధిష్టానం కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు ఆ పార్టీవర్గాల విశ్వసనీయ సమాచారం. అయితే ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి ఒక సిట్టింగ్ ఎంపీ, ఉమ్మడి ఖమ్మం నుంచి మరో సిట్టింగ్ ఎంపీ కూడా తమ పార్టీలో చేరే అవకాశాలున్నాయని బీజేపీ నేతలు చెబుతున్నారు. అయితే ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన సదరు ఎంపీ గతంలో ఉత్సాహం చూపినా, ఆ తర్వాత కొంత ఆచితూచే ధోరణితో ఉండడంతో చేరికపై పూర్తి స్పష్టత రాలేదని తెలుస్తోంది.

**టికెట్‌పై భరోసా ఇస్తే...? :** వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తాము సిట్టింగ్‌లుగా ఉన్న చోట నుంచే అవకాశం ఇవ్వాలంటూ ఉమ్మడి మెదక్, ఖమ్మం జిల్లాలకు చెందిన ఇద్దరు ఎంపీలు బీజేపీ జాతీయ నాయకత్వం నుంచి భరోసా కోరినట్టు ప్రచారం జరుగుతోంది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఏర్పడే అవకాశాలు మెండుగా ఉన్నాయన్న అంచనాల నేపథ్యంలో పలువురు సిట్టింగ్ ఎంపీలు బీజేపీలో చేరేందుకు ఉత్సాహం చూపుతున్నారని ఆ పార్టీనేతలు చెబుతున్నారు. బీజేపీలోకి ఇతర పార్టీల నుంచి సిట్టింగ్ ఎంపీల చేరికను బట్టి 17 ఎంపీ స్థానాల్లో అభ్యర్థుల ఖరారుపై ఓ స్పష్టత వస్తుందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఈ నెల 29న లేదా మరో తేదీన జరిగే పార్టీ పార్లమెంటరీ బోర్డు భేటీలో రాష్ట్రానికి సంబంధించిన 8 నుంచి 10 ఎంపీ స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించే అవకాశమున్నట్టు తెలిసింది.

**సర్వేలే ప్రాతిపదికగా...** మోదీపాలన, బీజేపీ పట్ల పెరుగుతున్న ఆదరణకు తోడు పార్టీ తరఫున బరిలో నిలపాలని భావిస్తున్న అభ్యర్థులు, ఇతర పార్టీల సిట్టింగ్ ఎంపీల ఇమేజ్, గుర్తింపు జత కలిస్తే గెలిచే అవకాశాలు మరింత మెరుగవుతాయని పార్టీ నాయకత్వం అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో ఎంపీ అభ్యర్థుల ఎంపికపై వివిధ అంశాల ప్రాతిపదికన పలు దఫాలుగా బీజేపీ సర్వేలు నిర్వహిస్తోంది. రాష్ట్రంలో 12 ఎంపీ సీట్ల పరిధిలో మోదీ పాలన, పార్టీ పట్ల ప్రజల్లో మద్దతు 30 శాతానికి పైగా వ్యక్తం కాగా, ప్రజల్లో సొంతంగా పదినుంచి 15 శాతం సానుకూలత సాధించే బలమైన అభ్యర్థికి టికెట్ ఇస్తే 8 నుంచి 10 దాకా కచ్చితంగా గెలిచే అవకాశాలున్నాయని బీజేపీ ముఖ్యనేతలు అంచనా వేస్తున్నారు. మిగతా ఐదారు స్థానాల్లో పార్టీ పట్ల ప్రజల్లో 20 శాతం దాకా మద్దతు వ్యక్తం కాగా, ఆయా స్థానాలకు పోటీపడుతున్న పార్టీ అభ్యర్థుల్లో ఐదారు శాతమే సానుకూలత వ్యక్తం కావడంతో ఆ స్థానాల్లో అభ్యర్థుల ఖరారు పెండింగ్‌లో పెట్టాలని నాయకత్వం నిర్ణయించినట్టు సమాచారం. పార్టీ అభ్యర్థులు అంతగా బలంగా లేని ఆయా సెగ్మెంట్ల పరిధిలో ఇతర పార్టీలకు చెందిన సిట్టింగ్ ఎంపీలు వస్తే గెలిచే అవకాశాలపై అన్వేషణ సాగిస్తున్నట్టు తెలిసింది. ఇందులో భాగంగానే బీజేపీ టికెట్ ఆశిస్తున్న ఇతర పార్టీలకు చెందిన కొందరు సిట్టింగ్ ఎంపీలు ఓకే అంటే వారిలో బరిలో దింపేందుకు నాయకత్వం సిద్ధమైనట్టు పార్టీ వర్గాల సమాచారం. కొద్దిరోజుల క్రితం నగరశివార్లలో జరిగిన రాష్ట్రపార్టీ విస్తృత సమావేశంలో నిర్వహించిన అభిప్రాయసేకరణలో బీఆర్ఎస్ ఎంపీ రాములు చేరితే నాగర్‌కర్నూల్ ఎంపీ స్థానాన్ని తప్పక గెలుచుకోగలుగుతామనే అభిప్రాయాన్ని పార్టీనాయకులు వెలిబుచ్చినట్టు పార్టీవర్గాల సమాచారం. పార్టీపరంగా సర్వేతో పాటు రాములు వస్తే విజయం సాధిస్తామనే అంచనాల నేపథ్యంలో ఆయనను చేర్చుకునేందుకు ముఖ్యనేతలు లైన్ క్లియర్ చేసినట్టు తెలుస్తోంది.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## జనసేనకు24 సీట్లు ఎక్కువ? తక్కువ?

గతానికి వర్తమానానికి పరిస్థితులు మారిపోయాయి. ఒకనాటి రాజకీయంతో ఇప్పటి రాజకీయాన్ని అస్సలు పోల్చలేం. మరీ.. ముఖ్యంగా గడిచిన పదేళ్లలో వచ్చిన మార్పులు అన్ని ఇన్ని కావు. రాజకీయం అంటే నిర్వచనమే మారిపోయింది. దీనికి తోడు ఆయుధంలా మారిన సోషల్ మీడియా పుణ్యమా అని.. రాజకీయ పార్టీలు నిజాల కంటే అబద్ధాల్ని.. అసత్యాల్ని తమ వ్యూహానికి తగ్గట్లుగా ప్రచారం చేసుకుంటున్న పరిస్థితి. తెలుగుదేశం.. జనసేనకు మధ్య పొత్తు కుదురుతుందన్నది పాత విషయం. ఆ మాటకు వస్తే జనసేనకు ఎన్ని సీట్లు కేటాయిస్తారు? అన్నది కూడా పాత ముచ్చటే. ఎందుకుంటే.. పొత్తు అన్నంతనే జనసేనకు ఎన్ని సీట్లు? అన్న లెక్కలు వచ్చినప్పుడు.. ఏపీ వ్యాప్తంగా ఉన్న 175 స్థానాల్లో ఆ పార్టీకి పొత్తు ధర్మంలో భాగంగా ఎవరూ 30కి మించి చెప్పింది లేదు. ఆ మాటకు వస్తే ఏపీ అధికార పక్ష నేతలు సైతం తమ ప్రైవేటు సంభాషణల్లో జనసేనకు ముప్ఫై లోపు సీట్లు కేటాయిస్తే.. తమకు ఇబ్బంది అన్న మాటను తరచూ చెప్పటం కనిపిస్తుంది. మీడియా వర్గాలు సైతం జనసేనకు పదిహేను నుంచి పాతిక మధ్యనే సీట్ల కేటాయింపు లెక్కలు చెప్పారే కానీ.. ఏ రోజు యాభై.. 75 సీట్లు లాంటి మాటలు ఏ ఒక్కరు మాట్లాడింది లేదు. ఏపీలోని ఉమ్మడి జిల్లాలైన 13లో.. జనసేనకు బలమైన నేతలు ఉన్న జిల్లాలు కొద్దిగానే ఉన్నాయి. నిజానికి పార్టీకి ఉన్న అభిమానులతో పోలిస్తే.. ఆ అభిమానానికి అవసరమైన నేతల సంఖ్య తక్కువగానే ఉందని చెప్పాలి. పవన్ మైండ్ సెట్.. ఆయన తీరు సగటు రాజకీయ పార్టీ అధినేత తీరుకు భిన్నంగా ఉండటమే దీనికి కారణం. ఏమైతేనేం కానీ పవర్ చేతికి రావటం అనే కాన్సెప్టుకు పవన్ కల్యాణ్ విరుద్ధం. ఈ కారణంగానే ఆయన స్వయంగా పోటీ చేసిన రెండు స్థానాల్లో ఓడిపోవటానికి కారణమైంది. గడిచిన ఐదేళ్లలో ఆయనకు ఎదురైన అనుభవాల నేపథ్యంలో ఆయనలో కొంత మార్పు కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది. అయితే.. మారాల్సింది ఇంకా చాలానే ఉందని చెప్పాలి. ఇక.. సీట్ల కేటాయింపు విషయానికి వస్తే.. పొత్తులోభాగంగా రెండు పార్టీల మధ్య కుదిరిన 24 సీట్ల ఒప్పందం ఉన్నంతలో రెండుపార్టీలకు విన్ టు విన్ అన్నట్లు చెప్పాలి. ఉన్నది ఉన్నట్లుగా చెబితే.. 18స్థానాలకు మించిన ఇచ్చే ప్రతి సీటు.. ఓడిపోవటమే తప్పించి గెలిచే అవకాశం లేదన్న వాదనలు కొందరు వినిపిస్తున్నారు. మొత్తంగా జనసేనకు కేటాయించిన 24 సీట్లు గౌరవప్రదమైనవిగా చెప్పాలి. రాజకీయ ప్రత్యర్థులు చెబుతున్నట్లుగా యాభై నుంచి 75 స్థానాలు కేటాయించారనే అనుకుందాం? అప్పుడేమవుతుంది?అసలు అంతమంది నేతలు జనసేనలో ఉన్నారా? అన్నది ప్రశ్న. ఎంత పిండికి అంత రొట్టె అన్నట్లుగా.. పార్టీని తాను తీర్చిదిద్దిన దానికి తగ్గట్లే జనసేనకు 24 సీట్లు కేటాయించటం ఎక్కువే కానీ తక్కువ మాత్రం కాదని చెప్పక తప్పదు. ఈ విషయం జనసేన అధినేత పవన్ కల్యాణ్ కు కూడా తెలియంది కాదు. అందుకే.. ఆయన విమర్శలను పెద్దగా పట్టించుకోకుండా తన పని తాను చేసుకుంటున్నారు. అంతేకాదు.. తమ పొత్తు లెక్కలు బహిరంగ పర్చిన తర్వాత వచ్చే విమర్శల తీవ్రత ఆధారంగా తమ లెక్క కరెక్టుగా ఉందన్న విషయాన్ని అటు టీడీపీ – ఇటు జనసేన వర్గాలు ప్రైవేటు సంభాషణల్లో వ్యాఖ్యానించటం గమనార్హం. మొత్తంగా చూస్తే పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించిన 24 సీట్లు తక్కువ కాదు.. కాస్తంత ఎక్కువేనని చెప్పక తప్పదు.

# ఖానాపూర్ మున్సిపాలిటీ "హస్తగతం"

**మున్సిపల్ చైర్మన్ గా చిన్నం సత్యనారాయణ**

**వైస్ చైర్మన్ గా కావలి సంతోష్...**





**ఖానాపూర్ ఫిబ్రవరి 28(ప్రభాత సమాచారం)**
ఖానాపూర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ కైవసం చేసుకుంది. గత 5 వ తేదీన మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, వైస్ చైర్మన్ అబ్దుల్ ఖలీల్ ల పై ఇటీవలే కౌన్సిలర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాసం తీర్మానం నెగ్గడంతో నూతన చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఉదయం 11 గంటలకు ఎన్నిక ప్రక్రియ ప్రారంభం కాగా ఎన్నికల ప్రత్యేక అధికారి జెడ్పీ సీఈవో గోవింద్ ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. ఈ ఎన్నికకు ఖానాపూర్ మున్సిపల్ కౌన్సిలర్లు 12 మంది ఉండగా తొమ్మిదిమంది కౌన్సిలర్లు ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఎక్స్ అఫిషియో సభ్యుడిగా హాజరయ్యారు. ముందుగా మున్సిపల్ చైర్మన్ ఎన్నికను నిర్వహించగా ఏకగ్రీవంగా చైర్మన్ గా చిన్నం సత్యనారాయణ,వైస్ చైర్మన్ గా కావలి సంతోష్ ను కౌన్సిలర్లు ఎన్నుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఖానాపూర్ సిఐడి మోహన్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తుతో ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అనంతరం కాంగ్రెస్ శ్రేణులు నూతన చైర్మన్ వైస్ చైర్మన్ లను భారీ పూల గజమాలతో సత్కరించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ఎదుట బాణసంచాలు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.మనోహర్ తో పాటు కౌన్సిలర్లు కాంగ్రెస్ నాయకులు మున్సిపాల్ సిబ్బంది పాల్గొన్నారు

# ఎంపీపీ ఎన్నిక ప్రక్రియ నేటికీ వాయిదా



**గుడిహత్నూర్ ఫిబ్రవరి 28( ప్రభాత సమాచారం)**
మండలంలో ఖాళీగా ఉన్న మండల పరిషత్ అధ్యక్షుని ఎంపిక ప్రక్రియ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశాల మేరకు బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో అబ్దుల్ హై ఆధ్వర్యంలో ఎన్నికను నిర్వహించారు. ఈ ఎన్నికకు ప్రొసీడింగ్ అధికారిగా ఎన్. వెంకటేశ్వర్లు జిల్లా క్రీడలు యువజన అధికారి వ్యవహరించారు. గతంలో ఎంపిపిగా కొనసాగిన రాథోడ్ పుండలిక కరోనాతో రెండేళ్ల క్రితం మృతి చెందగా వైస్ ఎంపీపీగా ఉన్న నాగర్ గోజే భారత్ ఇంచార్జ్ ఎంపీపీగా బాధ్యతలు కొనసాగించారు. అయితే ఖాళీగా ఉన్న ఎంపీపీ స్థానాలను భర్తీ చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం ఎంపీపీ ఎంపిక ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బిజెపి, పార్టీలకు చెందిన తొమ్మిది మంది ఎంపిటిసిలు హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ నుండి గురూజ ఎంపిటిసి పెందూర్ లలిత ఎంపిపి పదవి కోసం నామినేషన్ వేయగా ఆమెకు గుడిహత్నూర్, సీతాగొంది ఎంపిటిసిలు అంకతి సవితా, చిట్యాల కృష్ణవేణి మద్దతు తెలిపాగా. బీఆర్ఎస్ నుండి మన్నూర్ ఎంపీటీసీ కేంద్రే జ్ఞానొబా నామినేషన్ వేయగా తోషం, మచ్చాపూర్ ఎంపీటీసీలు శగీర్ ఖాన్, వచ్చాలబాయి ఆయనకు మద్దతు తెలిపారు. బిజెపి నుండి ఇద్దరు ఎంపిటిసిలు ఉండగా వారు నామినేషన్ వేయకపోగా ఎవరికి మద్దతు కూడా తెలుపలేదు. అధికారులు కొద్దిసేపు వేచి చూడగా ఏఒక్క అభ్యర్థికి పూర్తి మెజారిటీ ఓట్లు రాకపోవడంతో ఎన్నికను వాయిదా వేశారు. ఎన్నికను మళ్లీ నేటికీ నిర్వహిస్తామని ప్రొసీడింగ్ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ఎంపిటిసిలు పాల్గొన్నారు

# గొప్ప లక్ష్యాలను పెట్టుకొని చదవాలి

**కేజీబీవీ పాఠశాలలో అదనపు గదుల నిర్మాణ పనులకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే**



**దస్తురాబాద్ ఫిబ్రవరి 28(ప్రభాత సమాచారం)**
గొప్ప లక్ష్యాలను పెట్టుకుని ఉన్నత చదువులు చదువుకోవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం దస్తురాబాద్ మండలంలో కేజీబీవీ పాఠశాలలో అదనపు గదుల నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదవాలని పేర్కొన్నారు.అనుకున్న లక్ష్యాలను సాధించడానికి నిరంతరం చదవాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు,పాల్గొన్నారు.



**పేదలకు కల్యాణ లక్ష్మి వరం: ఎమ్మెల్యే...**
పేదింటి ఆడపడుచులకు కళ్యాణ లక్ష్మి పథకం వరమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. బుధవారం దస్తురాబాద్ మండలంలోని తాసిల్దార్ కార్యాలయంలో కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను పంపించేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా పేదలకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. త్వరలో లక్ష రూపాయలతో పాటు తులం బంగారం అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పార్టీలోకి పలువురి చేరిక



**(ప్రభాత సమాచారం బోథ్)**
సొనాల మండలకేంద్రంలో బోథ్ నియోజకవర్గ ఇన్చార్జి ఆడే గజేంధర్ ,తెలంగాణ స్టేట్ కాంగ్రెస్ విచార్ విభాగ్ కోఆర్డినేటర్ తుల అరుణ్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ కో ఆప్షన్ మెంబర్ షేక్ మహముధ్ ఖాన్ ,సీనియర్ నాయకులు హరి సింగ్, రమణ రెడ్డి,చెట్లపెల్లీ సుధీర్, దండారి సంతోష్ లను కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం తాము ఎల్లవేళల కృషి చేస్తామని రాబోవు పార్లమెంటు ఎలక్షన్లో మరింత ఉత్సాహంగా పని చేసి పార్టీనీముందుండి నడిపిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుడాల శేఖర్ ,గాజుల పోతన్న, అంకత్ రవి,అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ బద్దం పోతారెడ్డి, బత్తుల రమేష్, యూత్ కాంగ్రెస్ కార్యదర్శి అనీష్ గుడాల,ఎస్టీ సెల్ ప్రెసిడెంట్ బలరాం,సోనాల టౌన్ ప్రెసిడెంట్ చెట్లపెల్లి అనిల్ ,సిర్పూర్ మహేష్, లోళపు పోషెట్టీ ,పవన్ ,లాలూరామ్, జకేష్ పాల్గొన్నారు

# కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణి చేసిన ఖానాపూర్ ఎమ్మెల్యే...



**ఖానాపూర్ ఫిబ్రవరి 28(ప్రభాత సమాచారం)**
మండలంలోని తహసిల్దార్ కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ బుధవారం పంపిణి చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. పేదింటి ఆడపడుచులకు రాష్ట్ర ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా లక్ష రూపాయలను అందిస్తుందని పేర్కొన్నారు. త్వరలో లక్ష రూపాయలతో పాటు తులం బంగారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ కు భారీ షాక్

**ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ లో చేరిన మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్స్**





**ఖానాపూర్ ఫిబ్రవరి 28(ప్రభాత సమాచారం)**
పట్టణ కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సమక్షంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కావాలి సంతోష్, కౌన్సిలర్స్ లత, విజయ లక్ష్మి, శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే వారికీ కండువా కప్పి పార్టీలో సాధారంగా ఆహ్వానించారు.

# చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



**ఉట్నూర్ ఫిబ్రవరి 28(ప్రభాత సమాచారం)**
మండల కేంద్రంలోని చైతన్య జూనియర్ కాలేజ్ ఎదుట మెస్రం సోంజీ వార్డెన్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చెలివేంద్రాన్ని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ రిబ్బన్ కట్ చేసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.వేసవి కాలన్ని దృష్టిలో ఉంచుకొని చలివేంద్రాన్ని ప్రారంభించడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త మెస్రం కేశవ్,బాలాజీ రజనీకాంత్ పాల్గొన్నారు.

# కాలుష్య మిల్లులు!



పెద్దపల్లి: జిల్లాలో ఇప్పటికే పారిశ్రామిక ప్రాంతమైన రామగుండంలో ఎరువులు, విద్యుత్తు, సింగరేణి, సిమెంట్, ఇటుక పరిశ్రమలు వెదజల్లే కాలుష్యంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఆ కోవలోకి బియ్యం మిల్లులు కూడా వచ్చి చేరాయి. పెద్దకల్వల వయా రాజీవ్ రహదారి నుంచి సుల్తానాబాద్‌లోకి ప్రవేశించగానే ఒక్కసారిగా బియ్యం మిల్లుల నుంచి వచ్చే ఊక దుమ్ము, బాయిల్డ్ మిల్లుల నుంచి వచ్చే నల్లధూళి కణాలు కళ్లలో పడి నరకం చూపిస్తాయి. నిరంతరం వాహన చోదకులకు, ప్రయాణికులకు ఈ మార్గం ఇబ్బందికరంగా మారింది. మరోవైపు బాయిల్డ్ (ఉప్పుడు) మిల్లుల నుంచి వెలువడే నీటి వ్యర్థాలు పరిసర పంటపొలాలకు నిల్వ చేరి దుర్వాసన వెదజల్లుతున్నాయి. సుల్తానాబాద్‌లోని కాట్నపల్లి, పూసాల గ్రామాల్లోని ఉప్పుడు మిల్లుల నుంచి వెలువడే బియ్యం వ్యర్థపు నీటిని తాగేందుకు పందులు, ఇతర పశువులు వచ్చి తమ పంటలను నాశనం చేస్తున్నాలయని ఇటీవలే ప్రజావాణీలో కొందరు రైతులు ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. దీనిపై జిల్లా పర్యావరణ కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) ఈఈని వివరణ కోరేందుకు చరవాణిలో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

గాలిలో దీపంగా పర్యావరణ పరిరక్షణ

కొంతమంది మిల్లర్లు ప్రత్యామ్నాయ రాజకీయ శక్తులుగా వ్యవహరిస్తూ పర్యావరణ నిబంధనలు అతిక్రమిస్తున్నారు. అధికారులు తనిఖీలు చేసేందుకు వస్తే రాజకీయ పైరవీలు, ఒత్తిళ్లు చేయిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా బియ్యం మిల్లుల సంక్షేమ సంఘాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. రాజకీయ పార్టీల వారీగా మిల్లర్లు ఉండటంతో అధికారులు వస్తే తనిఖీలు చేసేందుకు సహకరించడం లేదు.

రైస్‌మిల్లుల నుంచి వెలువడే ధాన్యపు పొట్టు బయటకు రాకుండా, రహదారులపై పడకుండా ప్రత్యేకంగా కవర్లు, సంచులను ఏర్పాటు చేయాలి. ఇలా 20 శాతం రైస్‌మిల్లులు మాత్రమే చేస్తున్నాయి. గాలిలో ధూళి, దుమ్ము చేరకుండా నాణ్యమైన యంత్రాలను ఉపయోగించాలి. 30 శాతం మిల్లుల్లో ఈ యంత్రాలకు కాలం చెల్లాయి.

ఈ మిల్లుల పరిశ్రమల చుట్టూ 10 మీటర్ల మేరకు వెడల్పుతో ‘గ్రీన్‌బెల్ట్’ను అభివృద్ధి చేస్తూ మొక్కలు నాటి వాటిని పర్యవేక్షించాలి. జిల్లాలోని ఏ ఒక్క రైస్‌మిల్లులో చెట్లు పెంచడం లేదు.

ధాన్యం వండుతున్న క్రమంలో వెలువడే మిల్లులోని వ్యర్థ జలాలను బహిరంగ ప్రదేశాలకు, కాలువల్లోకి వదలవద్దు. ప్రత్యేకంగా రైస్‌మిల్లులో వ్యర్థాలకు సంబంధించిన ఏర్పాట్లు చేసుకోవాలి. 80 శాతం మిల్లులకు ఈ వ్యవస్థ లేదు.

బాయిలర్ నుంచి వచ్చే బూడిదను నిల్వ చేయడానికి మూసి ఉండే షెడ్లు ఏర్పాటు చేయాలి. ఈ నిబంధనల్లో ఏ ఒక్కటి ఎవరూ సరిగా పాటించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

మిల్లుల్లో వెలువడే పొగ మూలంగా సమీప ఇళ్లలో ఉండే గృహిణులు, వృద్ధులు ఎక్కువగా శ్వాసకోశ సంబంధ, నేత్ర సంబంధ వ్యాధులకు గురవుతున్నారు.

పెద్దపల్లి నూతన కలెక్టరేట్‌లో సమీపంలో ఉన్న 8 మిల్లులకు అధికారులకు గతంలో పీసీబీ నోటీసులు ఇచ్చింది. వెంటనే పొగ, ఊకధూళి రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించినప్పటికీ ఫలితం లేదు. ఇప్పటికీ ఇక్కడి మొక్కలు, కార్యాలయాలు, వాహనాలపై వీటికి సంబంధించిన ధూళి కమ్మేస్తున్నాయి.

నిబంధనల బేఖాతరు

నిబంధనలు పాటించని రైస్‌మిల్లుల నిర్వహణ మూలంగా కూడా పరిసరాలు కంపుకొడుతున్నాయి. కాలం చెల్లిన యంత్రాలు వెదజల్లే పొగతో కార్బన్ డై ఆక్సైడ్ మోతాదు ఎక్కువై సమీప పంట పొలాలు, చెట్లకు పొగ, ధూళి చేరుతుంది. వాతావరణంలో కర్బన ఉద్గారాలను విడుదల చేస్తున్నాయి. అయిదేళ్ల క్రితం వాయు కాలుష్యానికి కారణమవుతున్న మిల్లు యజమాన్యాలకు గతంలో పర్యావరణ కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) నోటీసులు జారీ చేయగా రాజకీయ పైరవీలతో నోటీసులకు స్పందించడం లేదు. జిల్లాలో 112 బాయిల్డ్, 80 వరకురా రైస్ మిల్లులున్నాయి.

# మాతా, శిశువులకు రక్షణ కరవు

కరీంనగర్ : కరీంనగర్ మాతా, శిశు ఆరోగ్య కేంద్రంలో భద్రత డొల్లతనం బయటపడింది. నవజాత శిశువును మహిళ అపహరించుకుపోయింది. రెక్కీ నిర్వహించి ఎత్తుకెళ్లినా పట్టించుకునే వారే లేరు. గతంలో ఆసుపత్రికి వచ్చే వారికి పాసులు అందజేసిన సిబ్బంది.. ఆ తర్వాత విస్మరించారు. పోలీసులు త్వరితగతిన స్పందించి గాలింపు చర్యలు చేపట్టడంతో శిశువు ఎట్టకేలకు తల్లి వద్దకు చేరింది. ఆసుపత్రిలో భద్రత సిబ్బంది వైఫల్యం, పర్యవేక్షణ లోపంపై కథనం.

అనుమానాస్పదంగా తిరుగుతున్నా..

ఆదివారం ఉదయం గోపాల్‌రావుపేటకు చెందిన త్రివేణి మగ శిశువును అపహరించడానికి ఆ మహిళ ప్రయత్నం చేసింది. కరోనా వ్యాక్సిన్ వేయించాలని చెప్పి తీసుకెళ్తుండడంతో బంధువులు ఆమె వెంట వెళ్లడంతో అప్రమత్తమై తిరిగి ఇచ్చేసింది. అనంతరం 12 ఏళ్ల బాలుడి చేతిలో శిశువును చూసింది. టీకా వేయించాలని చెప్పి అపహరించుకుపోయింది. ఇంత తతంగం జరుగుతున్నా విధుల్లో ఉన్నా సిబ్బంది ఏం చేస్తున్నారో తెలియలేదు. ఆ తర్వాత తేరుకున్న వారు పోలీసులకు సమాచారం చేరవేశారు.

విస్మరించిన పాస్ వ్యవస్థ..

ఆసుపత్రిలో ప్రవేశించడానికి బయటకు రావడానికి ఒకే దారి ఉంది. అక్కడ రక్షణ సిబ్బంది ఉండి అనుమానం వచ్చిన వారిని ప్రశ్నిస్తే




సరిపోయేది. గతంలో గర్భిణుల, బాలింతల బంధువులు వచ్చి వెళ్లడానికి పాసులు జారీ చేశారు. వాటిని అమలు చేయడంలో వైద్య సిబ్బంది శ్రద్ధ చూపలేదు. ఎవరుపడితే వారు ఇష్టారీతిన రావడం.. పోవడం చేస్తున్నారు. చికిత్స అందించడానికి వైద్య బృందానికి ఇబ్బందులతో పాటు బాలింతలకు ఇన్‌ఫెక్షన్ సోకే ప్రమాదముంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పద్ధతి ప్రకారం గర్భిణులు, బాలింతల బంధువులు వచ్చి వెళ్లేలా చర్యలు తీసుకుంటే తప్పిదాలు జరగడానికి అవకాశం ఉండదు. అపహరించింది ఎవరని సీసీ కెమెరాల ఫుటేజీ ద్వారానే తెలిసింది. కెమెరాలు చిన్నవి, దుమ్ము పట్టి స్పష్టంగా కనిపించలేదు. పెద్ద కెమెరాలను ఏర్పాటు చేస్తే బాగుంటుం దని పోలీసులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

వైద్య బృందంపై చర్యలు

శిశువు అపహరణకు గురైన ఘటనపై విచారణ ప్రారంభించాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బాధ్యులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటాం. ఇలాంటి ఘటనలు జరగకుండా రక్షణ సిబ్బందిని అప్రమత్తం చేశాం. వీరారెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్

# ఘాటెక్కిన ఎర్రకోట


ఖమ్మం : ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ఎర్రబంగారం మెరిసింది. మిరప బస్తాల వాహనాలతో విపణి నలువైపులా బజార్లు నిండిపోయాయి. ప్రధాన మార్కెట్ కిక్కిరిసిపోవటంతో మరో యార్డుకు సరకును తరలించాల్సి వచ్చింది. నాలుగైదేళ్లుగా ఎన్నడూ లేనంతగా సుమారు లక్ష బస్తాల మిరపను రైతులు తీసుకొచ్చారు. అంతకుముందు ఓసారి 1.20 లక్షల బస్తాల సరకు మార్కెట్‌కు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు.

మార్కెట్‌కు నేడు సెలవు

విపణికి వరుసగా మూడు రోజులు సెలవులు రావటంతో భారీస్థాయిలో సరకు సోమవారం తరలివచ్చింది. తెలుగు రాష్ట్రాల్లో ‘తేజ’ రకానికి ప్రసిద్ధి చెందిన ఖమ్మం మార్కెట్ కిటకిటలాడింది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, నల్గొండ, సూర్యాపేట, ఏపీలోని వివిధ ప్రాంతాల నుంచి సరకు చేరిన నేపథ్యంలో కొనుగోళ్లు ఆలస్యమయ్యాయి. లోపలి సరకు బయటకు తరలించేందుకు చాలా సమయం పట్టిందని దిగుమతిశాఖ అధ్యక్షుడు దిరిశాల చినవెంకటేశ్వర్లు తెలిపారు. సత్వర చెల్లింపులు జరగటం వల్లే ఇక్కడికి ఎక్కువ మంది రైతులు వస్తున్నారని చెప్పారు. మార్కెట్‌లో అధిక సరకు ఉన్న నేపథ్యంలో కొనుగోళ్లకు అంతరాయం కలుగుతుందనే ఉద్దేశంతో మార్కెటింగ్‌శాఖ అధికారులు సెలవు ప్రకటించారు. నుంచే విపణికి ఎండు మిరప తరలిరావటంతో మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్, ద్వితీయశ్రేణి కార్యదర్శి బి.బజారు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. వాహనాల రాకపోకలను త్రీటౌన్ సీఐ రమేశ్, సిబ్బంది క్రమబద్ధీకరించారు.

విదేశాలకు ఎగుమతి చేసే వ్యాపారులు ఉండటంతో..

ఇతర దేశాలకు ఎగుమతి చేసే వ్యాపారులు ఖమ్మం మార్కెట్‌లో ఎక్కువగా ఉండటం వల్ల ఆశించిన ధర పలుకుతుందనే ఉద్దేశంతో ఎక్కువ మంది



రైతులు సరకు తెస్తున్నారు. ఇక్కడి నుంచి కోల్‌కతా, మహారాష్ట్ర, రాజస్థాన్, యూపీ, న్యూదిల్లీ, తదితర ప్రాంతాలకు సైతం మిరప రవాణా అవుతోంది. మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాలతో పాటు ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల నుంచి తేజ రకం మిరప ఖమ్మం మార్కెట్‌కు రావటం విశేషం.

క్వింటా రూ.20,600 చొప్పున వ్యాపారులు కొన్నారు. మాది నాణ్యమైన సరకు. క్వింటాకు కనీసం రూ.22వేలు పలుకుతుందని భావించా. వ్యాపారులు తొలుత ధర నిర్ణయిస్తున్నారు. తర్వాత నాణ్యత బాగాలేదని ధర తగ్గించి అడుగుతున్నారు. మార్కెట్‌కు సరకు తెచ్చాక వ్యాపారుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సి వస్తోంది.

బోడ దేవా, గొల్లచర్ల, మహబూబాబాద్ మండలం

ఈ సంవత్సరం మార్కెట్‌లో మిరపకు అధిక డిమాండ్ ఉంటుందని సాగు చేశాం. పంటకు తెగుళ్లు ఆశించటంతో దిగుబడులు గణనీయంగా తగ్గాయి. చేతికందిన పంట తక్కువే. అయినా దానికీ ఆశించిన ధర లభించటం లేదు. మార్కెట్‌కు వస్తే క్వింటా రూ.19 వేలకు అడుగుతున్నారు. ఈధరకు సరకు అమ్మి ఎలా బతకాలి. ఆరుగాలం కష్టపడి పంట పండిస్తున్న మిరప రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

అజ్మీరా మల్సూరు, మసివాగు, ఇల్లెందు మండలం

# సేవల విస్తరణలో జాప్యం



జగిత్యాల : ఉమ్మడి జిల్లా కేంద్రంగా ఉన్న జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) సేవలను కొత్త జిల్లాలకు విస్తరించేలా ఏడాది క్రితమే ఏర్పాటుచేయ తలపెట్టిన ప్రాంతీయ కార్యాలయాలను కనీసం ఈ ఆర్థిక సంవత్సరంలోనైనా అమలుచేస్తే రైతులకు కర్షకులకు ఉపయుక్తంగా ఉంటుంది. జిల్లాలవారీగా డీసీసీబీలను ఏర్పాటు చేయాలని ముందుగా నిర్ణయించినా వివిధ కారణాలతో ప్రాంతీయ కార్యాలయాలను ఏర్పాటుచేసి తదుపరి కొత్త జిల్లాలవారీగా డీసీసీబీలను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఇప్పటివరకు జిల్లా నుంచి కొందరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(ప్యాక్స్) అధ్యక్షులకు కరీంనగర్‌లోని డీసీసీబీలో సభ్యులుగా అవకాశం ఇస్తూవచ్చారు.

ప్రస్తుతం జిల్లాలో 15 బ్యాంకుశాఖలు పనిచేస్తుండగా జగిత్యాలలో ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటుచేసి రైతులు, సహకార సంఘాలకు సేవలను మరింతగా దరిచేర్చాలన్న నిర్ణయాన్ని తక్షణమే అమల్లోకి తేవాలి. ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుచేసిన అనంతరం డీసీసీబీలను కొత్త జిల్లాల వారీగా ఏర్పాటు చేసినట్లయితే జిల్లాకు చెందిన ప్యాక్స్‌ల అధ్యక్షులతోనే డీసీసీబీ కార్యవర్గం ఏర్పాటవుతుంది. ప్రస్తుతం కరీంనగర్ డీసీసీబీ పరిధిలో జగిత్యాలలో బ్యాంకు ఉండగా బ్యాంకు ఆవరణలోనే పాత భవనం కూడా ఉంది. ప్రస్తుతం డీసీసీబీ ప్రాంతీయ కార్యాలయాన్ని ఇక్కడే ఏర్పాటుచేసే వీలుంది, తదుపరి డీసీసీబీ ఏర్పాటుకు కూడా అనువుగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. డీసీసీబీ పరిధిలో ప్రస్తుతం రైతులకు పంట రుణాలు, టర్మ్ రుణాలు, దీర్ఘకాలిక, వ్యాపార రుణాలను ఇస్తుండగా కరీంనగర్‌లోని కేంద్ర కార్యాలయం నుంచి అనుమతి పొందాల్సి వచ్చేది.

గ్రామానికో ప్యాక్స్ లక్ష్యం..

దేశంలో అయిదేళ్లలో 2 లక్షల నూతన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ఏర్పాటు చేయాలని, ప్రతి గ్రామానికో ప్యాక్స్ ఉండాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు జిల్లాలోనూ ప్యాక్స్‌ల సంఖ్య పెరగనుంది. ప్యాక్స్‌ల ద్వారా 25 రకాల సేవలను అందించాలని కేంద్రం నిర్ణయించింది. జిల్లాలో ఇప్పటికే 51 ప్యాక్స్‌లుండగా 385 గ్రామపంచాయతీల్లో కనీసం మరో 50 గ్రామాల్లో నూతనంగా ప్యాక్స్‌లను ఏర్పాటుచేసే వీలుండటం కర్షకులకు కలిసిరానుంది. డీసీసీబీ పరిధిలో ఖాతాదారులు, సేవలు పెరిగినట్లయితే నాబార్డు, కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల రాయితీలు కూడా రైతులు, సహకార సంఘాలకు సులువుగా అందుతాయి. అన్నిసంఘాల పరిధిలో ధాన్యం, మక్కలను కొనుగోలు చేస్తుండగా జగిత్యాల, రాయికల్ తదితర సంఘాలు కేంద్ర ఎరువుల సంస్థ క్రిభ్‌కోలో రూ.50 లక్షల చొప్పున వాటాధనం చెల్లించి సాలీనా రూ.10 లక్షల డెవిడెంట్ పొందుతున్నాయి. చాలాసంఘాలు రుణాల మంజూరు, బ్యాంకింగ్ కౌంటర్లు, లాకర్లు, పెట్రోలు పంపులను నిర్వహిస్తుండగా విత్తనశుద్ధి ప్లాంట్లు, రైస్‌మిల్లుల ఏర్పాటుకు కృషి చేస్తున్నాయి. నాబార్డుద్వారా పలు సంఘాలకు రూ.20 లక్షల చొప్పున నిధులను అందించగా గోదాములను నిర్మించారు. ఈ నేపథ్యంలో డీసీసీబీ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు, ప్యాక్స్ కేంద్రాల సంఖ్యాపెంపు, ప్యాక్స్‌ల్లో రైతులందరినీ సభ్యులుగా చేర్పించటం దీర్ఘకాలికంగా లాభం కలిగించనుంది.

# కరవు నేలలో గోదావరి గలగల

తుర్కపల్లి : తుర్కపల్లి మండలంలో గోదావరి జలాలు కాలువల ద్వారా పరుగులు పెడుతున్నాయి. సిద్దిపేట జిల్లా కొండపోచమ్మ రిజర్వాయర్ నుంచి అధికారులు సాగునీటిని విడుదల చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లాకు గోదావరి జలాల రాకతో తుర్కపల్లి, బొమ్మలరామారం మండలాలకు చెందిన రైతులకు సాగునీటి తిప్పలు తీరనున్నాయి. తుర్కపల్లి, ఎం.తుర్కపల్లి ప్రధాన కాలువల ద్వారా చెరువులు, కుంటల్లోకి నీరు వచ్చి చేరుతోంది. అత్యవసరాన్ని దృష్టిలో పెట్టుకుని ముందస్తుగా నీటిని విడుదల చేయడం వల్ల రైతులకు ఎంతో మేలు జరగనుంది. వాసాలమర్రి, తుర్కపల్లి, వెంకటాపురం, వేల్పుపల్లి, మల్లాపురం, మల్కాపురం, ధర్మారం, గొల్లగూడెం, పల్లెపహాడ్‌తో పాటు బొమ్మలరామారం మండలంలోని కొన్ని ప్రాంతాలకు గోదావరి జలాలు పరుగులు తీస్తున్నాయి. అధికారులు 15 రోజుల క్రితం నీటిని విడుదల చేశారు. గోదావరి జలాల రాకతో చెరువులు, కుంటలు నిండి అలుగు పోస్తున్నాయి. మొత్తం 30 చెరువులు, కుంటలు నింపాలనే లక్ష్యం ఉండగా ఇప్పటి వరకు 12 చెరువులు నిండినట్లు అధికారులు పేర్కొన్నారు. మరో వారం రోజుల్లో చెరువులన్నీ నిండుతాయని నీటిపారుదల శాఖ డీఈఈ శ్రీధర్ తెలిపారు. సుమారు రెండు వేల ఎకరాలకు ఆయకట్టుకు నీరు అందనుంది.

# మార్పుపై ఆశలు

కామారెడ్డి : సార్వత్రిక ఎన్నికలు, సంస్థాగత మార్పుల కారణంగా జిల్లాలో పోలీస్, రెవెన్యూ, పంచాయతీ, పౌరసరఫరాలు, గ్రామీణాభివృద్ధిశాఖల్లో కీలక అధికారుల బదిలీలు జరిగాయి. వారి స్థానాల్లో కొత్తవారు వచ్చి విధుల్లో చేరారు. పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమైంది. రాష్ట్రంలోని కొత్త ప్రభుత్వం పారదర్శక పాలనకు పెద్దపీట వేస్తోంది. ఇందులో భాగంగా ప్రజల వద్దకే పాలనను చేర్చేందుకు పాలనాధికారి, ఎస్పీలతో పాటు ముఖ్య అధికారులకు సంస్కరణలు ప్రవేశపెట్టే స్వేచ్ఛనిచ్చింది. పొరుగున ఉన్న జిల్లాల్లో పోలీస్, రెవెన్యూ, విద్యాశాఖ అధికారులు సంస్కరణలు ప్రవేశపెట్టి పారదర్శక పాలనకు శ్రీకారం చుట్టి ప్రజల మన్ననలు పొందుతున్నారు. ఆ తరహాలోనే జిల్లాలోనూ అడుగులు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

హాజరుపై కొరవడిన పర్యవేక్షణ

కలెక్టరేట్‌తో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో హాజరుపై పర్యవేక్షణ కొరవడడంతో ఉద్యోగులు తమకు నచ్చిన సమయంలో విధులకు వస్తున్నారు. దీంతో పనుల నిమిత్తం దూర ప్రాంతాల నుంచి కలెక్టరేట్‌తో పాటు డివిజన్, మండల కార్యాలయాలకు వచ్చిన ప్రజలు గంటల తరబడి వారి కోసం వేచిచూడాల్సి వస్తోంది. ఇక ప్రభుత్వ ఆసుపత్రుల లోనైతే ఆన్‌కాల్ పద్ధతిలో చికిత్సలు కొనసాగుతున్నాయి. నిర్దేశిత సమయంలో ఉద్యోగులు విధులకు హాజరయ్యేలా పాలనాధికారి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఉద్యోగులు సమయ పాలన పాటించేలా సూర్యాపేట జిల్లాలో కలెక్టర్ ప్రత్యేక చొరవతో డిస్ట్రిక్ అటెండెన్స్ మేనేజ్‌మెంట్ తీసుకొచ్చారు. దీంతో కలెక్టరేట్‌తో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులు నిర్దేశిత సమయంలో హాజరవుతున్నారు.

పెరిగిన చరవాణి వినియోగం

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు విరివిగా చరవాణి వినియోగిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తరగతి గదుల్లో చరవాణి వినియోగంపై ఆంక్షలు విధించాలని పాఠశాల విద్యా కమిషనర్ జిల్లా విద్యాశాఖాధికారులకు ఆదేశాలు జారీచేశారు. సంఘాల ఒత్తిడికి తలొగ్గి చరవాణి వినియోగంపై ఆంక్షలు విధించేందుకు ఉత్తర్వులు జారీచేసేందుకు డీఈవో వెనుకడుగు వేస్తున్నారు. జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలో డీఈవోలు తరగతి గదుల్లో ఉపాధ్యాయులు చరవాణి వినియోగించవద్దని ఆదేశిస్తూ ప్రత్యేకంగా ఆయా జిల్లాల తరపున ఉత్తర్వులు జారీచేశారు. దీంతో చరవాణి వాడడం తగ్గించారు. ఇక్కడ కూడా చరవాణి వాడకంపై ఆంక్షలు విధించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

స్థిరాస్తి అక్రమాలు కోకొల్లలు

ఇటీవల బాన్సువాడకు చెందిన విశ్రాంత తహసీల్దార్‌కు చెందిన 260 చదరపు గజాల ప్లాటును లేఅవుట్ రీడిజైన్ పేరిట ఓ వ్యక్తి కబ్జా చేసిన విషయం తెలిసిందే. మూడేళ్ల పాటు రెవెన్యూ, పట్టణ ప్రణాళిక విభాగం అధికారుల చుట్టూ తిరిగారు. చివరకు కామారెడ్డి డివిజన్ పోలీసులను ఆశ్రయించడంతో సమస్యకు పరిష్కారం లభించింది. మధ్యతరగతి కుటుంబాలకు చెందిన పలువురు జిల్లా కేంద్రంలో రూ.లక్షలు వెచ్చించి స్థిరాస్తి వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేశారు. భూముల ధరలు పెరిగిన నేపథ్యంలో అక్రమార్కులు కొందరు ప్లాట్లను కబ్జా చేశారు. తమకు న్యాయం చేయాలంటూ పలువురు పోలీసులతో పాటు రెవెన్యూ, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను ఆశ్రయిస్తున్నప్పటికీ ప్రయోజనం దక్కడం లేదు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన పోలీస్ అధికారి “ఎకనామిక్ అఫెన్స్ వింగ్” పేరిట ప్రత్యేకంగా సిట్‌ను ఏర్పాటు చేసి స్థిరాస్తి మోసాలకు అడ్డుకట్టవేసేందుకు కార్యాచరణ రూపొందించారు. ఇందులో భాగంగా ముగ్గురు కార్పొరేటర్లను అదుపులోకి తీసుకుని రౌడీషీట్‌లు తెరిచారు. దీంతో అక్రమార్కులు భయపడి కబ్జాలు చేసిన ప్లాట్లను అప్పగిస్తున్నారు. ఇదే తరహాలో జిల్లా కేంద్రంలో స్థిరాస్తి అక్రమార్కుల కట్టడికి పోలీస్‌శాఖ ప్రత్యేక కార్యాచరణ రూపొందించాల్సిన అవసరం ఉంది.

# మారనున్న మదింపు విధానం

కామారెడ్డి : పురపాలికల్లో ఆస్తిపన్ను మదింపు విధానం మారనుంది. విలువ ఆధారంగా పన్ను ఖరారు కానుంది. దీనికి సంబంధించి కసరత్తును ప్రభుత్వం ముమ్మరం చేసింది. పన్ను విధింపులో కనిష్ఠ, గరిష్ఠ పరిమితులను నిర్ణయించింది. ఆయా పురపాలికల పరిధిలో పన్ను ఖరారు నిర్ణయాన్ని వారికే అప్పగించింది. దీంతో ఉమ్మడి జిల్లాలో ఏళ్ల నాటి ఆస్తి పన్నుల విషయంలో మార్పులు చోటుచేసుకోనున్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ఈ విధానాన్ని అమలు చేయనున్నారు.

ఆస్తి పన్ను ఖరారులో రిజిస్ట్రేషన్ల శాఖకు ప్రభుత్వం మెలిక పెట్టింది. తాజా విధానంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ భూములు, వ్యవసాయేతర ఆస్తుల విలువలను సవరించే మేరకు ఆస్తి పన్ను ఖరారవనుంది. ఇటీవల రిజిస్ట్రేషన్ల రుసుంలు పెరగడంతో నూతన విధానంలో ఎంత మేర ఆస్తిపన్ను ఉంటుందో అధికారులు అంచనా వేసే పనిలో నిమగ్నమయ్యారు. తాజాగా నిర్మాణ స్థలం, భవన విలువను పరిగణనలోకి తీసుకోనున్నారు. భూమి విలువ, ఆస్తి విలువ పెరిగే కొద్దీ పన్ను



కూడా పెరగనుంది.

75 గజాల్లోపు రూ.100

పురపాలక చట్టం ప్రకారం 75 గజాల్లోపు ఉన్న భవనానికి ఆస్తిపన్ను రూ.100 చెల్లించాల్సి ఉంటుంది. నివాసేతర భవనాలకు దాని విలువలో కనిష్ఠంగా 0.10 శాతం గరిష్ఠంగా 1 శాతం ఆస్తి పన్ను ఉంటుంది. వాణిజ్య భవనాలకు మార్కెట్ విలువలో కనిష్ఠంగా 0.25 శాతం, గరిష్ఠంగా 2 శాతం ఆస్తి పన్ను విధించనున్నారు. ఇక ప్రార్థన మందిరాలు, గ్రంథాలయాలు, చారిత్రక నిర్మాణాలు, ఆసుపత్రులు, బల్దియా భవనాలు, అనాథ, వృద్ధాశ్రమాలకు పన్నులో మినహాయింపు వర్తించనుంది.

ఖాళీ స్థలాలపై సైతం..నగర, పురపాలికల్లో ఖాళీస్థలాలకు పన్ను విధించనున్నారు. కనిష్ఠంగా 0.05 శాతం, గరిష్ఠంగా 0.20 శాతం ఖరారు కానుంది. ఖాళీస్థలాల్లో నిర్మాణాలు లేకున్నా ఇక నుంచి పన్ను పరిధిలోకి రానున్నాయి. నిర్మాణం చేసేటప్పుడు వీఎల్‌టీ కింద చెల్లించాల్సి ఉంటుంది. పురపాలకశాఖ నుంచి నిరభ్యంతర పత్రం అందజేయాల్సి ఉంటుంది. ఖాళీస్థలాలపై పన్ను వేయడం ద్వారా వచ్చే నిధులతో బల్దియాలు వివిధ అభివృద్ధి పనులకు వెచ్చించే వెసులుబాటు కలగనుంది.

ఉత్తర్వులు రాగానే అమలు– సుజాత, కామారెడ్డి కమిషనర్పురపాలికలో ఆస్తి పన్నును మార్కెట్ విలువ ఆధారంగా పెంచేందుకు చర్యలు చేపట్టనున్నాం. అధికారిక ఉత్తర్వులు రాగానే క్షేత్రస్థాయిలో పక్కాగా అమలుకు చర్యలు తీసుకుంటాం. నిబంధనల మేరకు ఆస్తి పన్ను ఖరారు చేయనున్నాం.



# రాష్ట్రానికి మోదీ, షా, నడ్డా

హైదరాబాద్: తెలంగాణలో బీజేపీ అగ్రనేతలు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా సహా పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వరుస ఎన్నికల పర్యటనలతో హెూరెత్తించను న్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రం నుంచి కనీసంగా పది ఎంపీ సీట్లు గెలుపొందాలన్న లక్ష్యం నేపథ్యంలో.. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ప్రచారాన్ని ప్రారంభించక ముందే బీజేపీ ఉధృత ప్రచారం చేపట్టాలని భావిస్తోంది. ఆ మేరకు ఆ పార్టీల అభ్యర్థుల ప్రకటనకు ముందే ఈ నెలాఖరులోగా బీజేపీ అభ్యర్థుల తొలిజాబితాను ప్రకటించి ఎన్నికల ప్రచారపర్వంలోకి దూకాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది.

**షెడ్యూల్ ఇచ్చేలోగానే మోదీ 2 సభలు...** ఎన్నికల షెడ్యూల్ వెలువడేలోగానే ఆదిలాబాద్, సంగారెడ్డిల్లో ఏర్పాటు చేసిన సభలకు ప్రధాని మోదీ విచ్చేసి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుడతారని తెలుస్తోంది. ఆయా సభలకు ముందు రోడ్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంకోత్సవాలు, శంకుస్థాపనలను మోదీ చేతుల మీదుగా చేపట్టాలని పార్టీ నేతలు భావిస్తున్నారు. గత పదేళ్ల పాలనలో కేంద్రంలో తమ ప్రభుత్వం సాధించిన ప్రగతితో పాటు జాతీయ, రాష్ట్రస్థాయిల్లో కాంగ్రెస్ పార్టీ తీరును, రాష్ట్రంలో గత తొమ్మిదిన్నరేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ సర్కారు అనుసరించిన ప్రజా వ్యతిరేక విధానాలపై మోదీ సునిశిత విమర్శలు చేస్తారని రాష్ట్ర పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

**29న బీజేపీ తొలి జాబితా...?** : ఈ నెల 29న ఢిల్లీలో జరగనున్న బీజేపీ పార్లమెంటరీ బోర్డు సమావేశంలో రాష్ట్రంలోని 17 సీట్లలో మెజారిటీ (అంటే 12 స్థానాలకు) అభ్యర్థులను ప్రకటించే అవకాశాలున్నాయని తెలుస్తోంది. ఈ 29న ఇద్దరు లేదా ముగ్గురు సిట్టింగ్ ఎంపీలు, ఐదారుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరే అవకాశాలు ఉన్నాయని విశ్వసనీయ వర్గాల సమాచారం. వీరి చేరికను బట్టి ఎవరు గట్టి అభ్యర్థులు అవుతారో వారి బలాబలాల ప్రాతిపదికన పేర్లను ఖరారు చేయనున్నట్టు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, మరింత మెరుగైన అభ్యర్థుల కోసం అన్వేషణలో భాగంగా... జహీరాబాద్, పెద్దపల్లి, నల్లగొండ, వరంగల్, ఖమ్మం సీట్లకు క్యాండిడేట్ల ఎంపికను పెండింగ్‌లో పెట్టినట్టుగా పార్టీ నాయకులు చెబుతున్నారు.

**ఎన్నికల షెడ్యూల్ వచ్చేలోగానే అగ్రనేతల విస్తృత ప్రచారం :** ఆదిలాబాద్, సంగారెడ్డి సభలకు పీఎం మోదీ, ఆ తర్వాత అమిత్ షా, జేపీ నడ్డా ప్రచారం, 4న హైదరాబాద్‌లో అమిత్ షా సభ!, 29న బీజేపీ తొలి జాబితా?, 12 సీట్లకు అభ్యర్థులను ప్రకటించే అవకాశాలు, 4న అమిత్ షా రాకుంటే మోదీ?, వచ్చే నెల 4న హైదరాబాద్‌లో సభ ద్వారా లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో అమిత్‌షా పాల్గొంటారని తెలుస్తోంది. ముందుగా రాష్ట్ర పర్యటన ఖరారైతే అదే రోజున అమిత్ షా బదులు మోదీ సభ ఉండొచ్చునని సమాచారం.

ఈ సభ కోసం గచ్చిబౌలి, సరూర్‌నగర్ స్టేడియాలను పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. రాష్ట్రంలోని 17 ఎంపీ స్థానాలు కవర్ చేసేలా (ఐదు వేర్వేరు ప్రాంతాల్లో) చేపట్టిన విజయసంకల్పయాత్రల ముగింపు సందర్భంగా హైదరాబాద్‌లో మార్చి 2న అమిత్‌షా సభతో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించాలని తొలుత భావించారు.

ఐతే 2వ తేదీకి బదులు 4న రాష్ట్రానికి వచ్చేందుకు అమిత్ షా సమయం కేటాయించడంతో అదేరోజున సభను నిర్వహించాలని నిర్ణయించినట్టు పార్టీవర్గాల సమాచారం.

## బండి సంజయ్ యాత్రలో ఉద్రిక్తత.. కాన్వాయ్‌పై గుడ్లతో దాడి..



వరంగల్: కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ప్రజాహిత యాత్రలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. బండి సంజయ్‌లో వరంగల్ పర్యటన సంధ్భంగా ఆయన కాన్వాయ్‌పై కొందరు వ్యక్తులు కోడి గుడ్లతో దాడి చేశారు. దీంతో, బీజేపీ కార్యకర్తలు భారీగా అక్కడికి చేరుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. వివరాల ప్రకారం.. బీజేపీ ఎంపీ బండి సంజయ్ ప్రజాహిత యాత్రలో భాగంగా నేడు వరంగల్ జిల్లాలో పర్యటిస్తున్నారు. ఈ క్రమంలో భీమదేవరపల్లి మండలంలోని వంగర వద్దకు చేరుకోగానే సంజయ్ కాన్వాయ్‌పై గుర్తు తెలియని వ్యక్తులు గుడ్లతో దాడికి చేశారు. కాగా, ఈ దాడులకు పాల్పడిందని కాంగ్రెస్ కార్యకర్తలేనని బండి సంజయ్, బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఇక, గుడ్ల దాడి నేపథ్యంలో బీజేపీ కార్యకర్తలు, మద్దతుదారులు భారీ సంఖ్యలో అక్కడికిచ చేరుకున్నారు. గుడ్లు విసిరిన వారి గుర్తించాలని డిమాండ్ చేశారు.

## పదవులు, అధికారం శాశ్వతంకాదు..

ఖమ్మం జిల్లా: ప్రజలందరి దీవెనలతో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యానని, తాను ఈ స్థాయిలో ఉండటానికి కారణం పాలేరు ప్రజలు పెట్టిన భిక్షని.. పదవులు, అధికారం శాశ్వతంకాదని రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు. బుధవారం తిరుమలాయపాలెం మండలం, మాదిరిపురంలో ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల భవనం శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. రాజకీయాల్లోకి వచ్చిన 11 నెలల్లోనే ఎంపీ అయ్యానని, పదవి ఉన్నా.. లేకపోయినా ప్రజలు తనను గుండెల్లో పెట్టుకుని చూసుకున్నారని అన్నారు. హాస్టల్ మాత్రమే ఉండి క్లాస్ రూమ్‌లు లేకపోవడంతో రూ. 5 కోట్లతో పాఠశాల ఏర్పాటు చేశామని, అధికారంలోకి వచ్చిన 80 రోజుల్లో ప్రభుత్వం ఏం చేస్తుందో మీరు చూస్తున్నారన్నారు. ఆరు గ్యారెంటీల్లో ఉచిత బస్సు పథకంలో ఇప్పటి వరకు 17 కోట్ల మంది మహిళలు ప్రయాణం చేశారన్నారు. మరో రెండు పథాకలు అమలు చేస్తున్నామని, 200 యూనిట్‌ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తామని స్పష్టం చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో మాట ఇస్తే ఎంత కష్టం అయినా ఈ ప్రభుత్వం నెరవేరుస్తుందని, ప్రజాపాలనలో ఇచ్చిన దరఖాస్తులో తప్పులు ఉంటే మళ్లీ అప్లై చేసుకోవచ్చునని మంత్రి పొంగులేటి అన్నారు. రూ. 500 లకే గ్యాస్ ఇస్తున్నామని, అర్హులైన వారందరికీ ఇస్తామని స్పష్టం చేశారు. ధరణి పేరుతో గత ప్రభుత్వంలో వేలాది ఎకరాలు కబ్జా చేశారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో ధరణిలో ఇచ్చిన అప్లికేషన్‌లు వెనక్కి పంపించారన్నారు. ధరణిలో వచ్చిన రెండు లక్షల నలబై ఐదు వేల అప్లికేషన్‌లను పరిష్కరిస్తామని, తెల్ల రేషన్ కార్డులను త్వరలోనే ఇస్తామని మంత్రి చెప్పారు.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను...
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.
సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194




## కేటీఆర్ క్షమాపణ చెప్పకపోతే క్రిమినల్ కేసు పెడతాం

హైదరాబాద్ : తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను వెనక్కు తీసుకొని, బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని టీపీసీసీ ఉపాధ్యక్షులు బంద్రు శోభా రాణి డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజలు ఇచ్చిన తీర్పుతో కేటీఆర్ చిన్న మెదడు చితికిపోయి మాట్లాడుతున్నారని సెటైర్లు వేశారు. బీఆర్ఎస్ నేతలందరూ ఆసుపత్రిలో చూపించుకోవాలని దుయ్యబట్టారు. లంకె బిందెల్లాంటి రాష్ట్రాన్ని దివాళా తీసేలా చేశారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పేరుతో రాష్ట్ర ఖజానాని హరీష్ రావు ఖాళీ చేశారని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజలకు స్వేచ్ఛ లేకుండా చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రజలకి విముక్తి లభించిందని పేర్కొన్నారు. ఆస్తుల చిట్టాని కేసీఆర్ కుటుంబం బయటపెట్టాలని కోరారు. కేటీఆర్ క్షమాపణ చెప్పకపోతే క్రిమినల్ కేసు పెడతామని ఆమె హెచ్చరించారు. ఇదిలావుండగా.. సీఎం రేవంత్ రెడ్డిని టార్గెట్ చేసుకొని కేటీఆర్ ఇటీవల సంచలన వ్యాఖ్యలు చేశారు. ఓ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం అభ్యర్థిగా రేవంత్ రెడ్డిని ముందే ప్రకటించి ఉంటే, కాంగ్రెస్ పార్టీకి కనీసం 30 సీట్లు కూడా వచ్చేవి కావని కుండబద్దలు కొట్టారు. అసలు రేవంత్ రెడ్డి ఒక ముఖ్యమంత్రిలా మాట్లాడడం లేదని, అతని పాత బుద్ధులన్నీ మెల్లగా బయటకు వస్తున్నాయని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తామని స్వయంగా కాంగ్రెస్ వాళ్లే ఊహించలేకపోయారని ఎద్దేవా చేశారు. రైతు రుణమాఫీపై ప్రశ్నిస్తే రేవంత్ రెడ్డిలో రోషం పొడుచుకుని వస్తోందన్నారు. కాంగ్రెస్ వాళ్లు ఇటుకలతో కొడితే, తాము రాళ్లతో కొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. ఎన్నికల ముందు అడ్డగోలు హామీలిచ్చిన కాంగ్రెస్ నాయకులకు ఇప్పుడేం చేయాలో అర్థం కావడం లేదన్నారు. ఈ విధంగా వ్యాఖ్యలు చేయడంతో.. కేటీఆర్‌పై కాంగ్రెస్ నాయకులు మండిపడుతున్నారు. కేటీఆర్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

## ఓఆర్ఆర్ టు ఆర్ఆర్ఆర్‌కు రేడియల్ రోడ్లు: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: అవుటర్ రింగ్ రోడ్డు నుంచి ప్రాంతీయ రింగ్ రోడ్డుకు రేడియల్ రోడ్లకు ప్రణాళికలు రూపొందించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. సచివాలయంలో హెచ్‌ఎండీఏ, పురపాలక శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. మాస్టర్ ప్లాన్ – 2050కి అనుగుణంగా విజన్ డాక్యుమెంట్ రూపొందించాలని సూచించారు. ఓఆర్ఆర్ లోపల ప్రాంతాలను ఒకే యూనిట్‌గా అభివృద్ధి చేయాలన్నారు. ఓఆర్ఆర్ – ఆర్ఆర్ఆర్ మధ్య ప్రాంతాలను హెచ్‌ఎండీఏ పరిధిలోకి తేవాలని చెప్పారు.

## నా తల్లిని అవమానపరుస్తారా?: బండి సంజయ్‌పై మంత్రి పొన్నం ఆగ్రహం

హైదరాబాద్: భాజపా ఎంపీ బండి సంజయ్ తన తల్లిని అవమానపరిచేలా మాట్లాడారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రాజకీయాలతో ఆమెకు ఏమైనా సంబంధముందా? అని ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు.

"ఎంపీగా తెలంగాణ, హుస్నాబాద్‌కు ఏం చేశావని ప్రశ్నిస్తే నా తల్లి ఆత్మక్షోభిస్తుందని మాట్లాడతారా? బతికున్న ఆమెను అవమానపరుస్తారా?మూడుసార్లు ఎమ్మెల్యేగా ఓడిపోయావు. నా దయాదాక్షిణ్యాల మీద అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ అయ్యావు.. ఇవాళ నువ్వు మాట్లాడుతున్నావా?.. జాగ్రత్త!" అని బండి సంజయ్‌ను ఉద్దేశించి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.






## ఎమ్మెల్యే సంజయ్‌కు బిగ్ షాక్.. చేజారిన జగిత్యాల..!

జగిత్యాల మున్సిపల్ చైర్మన్ ఎన్నికలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌కు బిగ్ షాక్ ఇచ్చారు ఆ పార్టీ కౌన్సిలర్లు. సంజయ్ ఆదేశాలను ధిక్కరించి మరీ వేరే వాళ్లకు జైకొట్టారు బీఆర్ఎస్ కౌన్సిలర్లు. బీఆర్ఎస్ ప్రతిపాదించిన వాణికి కాకుండా.. జ్యోతికి మద్దతు తెలిపారు కౌన్సిలర్లు. కాంగ్రెస్ కౌన్సిలర్లు సైతం జ్యోతికే సపోర్ట్ చేశారు. దీంతో బీఆర్ఎస్ ప్రతిపాదించిన వాణి ఓటమి పాలయ్యారు.

ఇక్కడ ఇంకో ట్విస్ట్ ఏంటంటే.. సంఖ్యా బలం ఉండి కూడా చైర్మన్‌ను పదవికి కోల్పోయింది బీఆర్ఎస్. దీంతో జగిత్యాల కొత్త మున్సిపల్ చైర్మన్‌గా అడువాల జ్యోతి ఎన్నికయ్యారు. వాణికి 23 ఓట్లు పడగా.. జ్యోతికి 24 మంది కౌన్సిలర్లు మద్దతు తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ కౌన్సిలర్ల సపోర్ట్‌తో జగిత్యాల మున్సిపల్ చైర్మన్‌గా జ్యోతి ఎన్నికయ్యారు.

జగిత్యాల మున్సిపల్‌లో మొత్తం 48 మంది కౌన్సిలర్లు ఉన్నారు. బుధవారం నిర్వహించిన మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు 35 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు హాజరయ్యారు. ఐదుగురు కాంగ్రెస్ కౌన్సిలర్లు, ముగ్గురు బీజేపీ కౌన్సిలర్లు, ఒక ఎంఐఎం కౌన్సిలర్ హాజరయ్యారు. అయితే ఒక బీఆర్ఎస్ కౌన్సిలర్ అందుబాటులో లేకపోవడంతో గైర్హాజరుగా ప్రకటించారు.

## రాజకీయాల్లో మగతనం అనే మాట ఎందుకు వస్తోంది: కడియం శ్రీహరి

వరంగల్: సీఎం రేవంత్ రెడ్డి వేదిక ఏదైనా సహనం కోల్పోయి మాట్లాడుతున్నారని, ఆయన భాష జుగుప్సాకరంగా ఉందని బీఆర్ఎస్ సీనియర్ నేత, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి విమర్శించారు. బుధవారం వరంగల్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం మాట్లాడుతున్న భాషను తీవ్రంగా ఖండిస్తున్నానమని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణ దేశానికే రోల్ మోడల్ గా నిలిచిందని చెప్పారు. 'సీఎంలో అసహనం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. మీ మేనిఫెస్టో.. మా మేనిఫెస్టోపైన మేం చర్చకు రెడీ. ప్రశ్నిస్తే మాపై మాటల దాడి చేస్తున్నారు. ముఖ్యమంత్రి ఎందుకు భయపడుతున్నారో అర్థం కావడం లేదు. రాజకీయాల్లో మగతనం మాట ఎందుకు వస్తోంది. మహిళా నాయకుల నాయకత్వంలో పనిచేస్తూ నువ్వు మగతనం గురించి మాట్లాడ్డం హాస్యాస్పదం. నువ్వు అంత మగాడివే అయితే తెలంగాణలో 17 ఎంపీ స్థానాలు గెలిపించి నీ మగ తనాన్ని నిరూపించుకో. సీఎంగారు మీ ప్రభుత్వాన్ని కూల్చాలన్న అలోచన మాకు లేదు. మీ ఆంతట మీరు కూలిపోతే మాకు సంబంధం లేదు.

మీ వాళ్లతో జాగ్రత్తగా ఉండండి. నీ కుర్చీ ఇనాం కింద వచ్చిందే అనుకుంటున్నాం. రాజీవ్ గాంధీ కుటుంబం ఇనామ్ కింద ఇచ్చిందే కదా నీ కుర్చీ. ఇందిరాగాంధీ నామజపంతో తుకుతున్న పార్టీ మీది. మీది జాతీయపార్టీ కాదు. ప్రాంతీయ పార్టీ మీది. ఆప్ కంటే అధ్వాన్నంగా మారింది కాంగ్రెస్ పార్టీ. మార్చి1వ తేదీన కాళేశ్వరం ప్రాజెక్ట్ వద్దకు వెళ్తున్నాం. త్వరలో కేసీఆర్ కూడా మేడిగడ్డ కు వస్తారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ అంటే కేవలం మేడిగడ్డ బ్యారేజ్ ఒక్కటే కాదు. మేడిగడ్డకు పెట్టిన ఖర్చు కేవలం రూ. 3 వేల కోట్లు మాత్రమే. కూలిపోయిన 3 పిల్లర్ల వద్ద రిపేర్ చేసి తెలంగాణ ప్రజలను ఆదుకోవాలి. బ్యారేజ్ కొట్టుకుపోయేలా చేయాలనే దుర్మార్గపు అలోచన చేస్తున్నారు.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660